



దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 295 సోమవారం 21-10-2024 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..


## యువత రాజకీయాల్లోకి
# రావాలి

**ఇదో ఉద్యమంలా సాగాలి.. అప్పుడే అవినీతి అంతం..**

**పరివార్‌వాదంతో దేశానికి ముప్పు: మోదీ**

**వారాణసిలో శంకర నేత్రాలయం ప్రారంభం**

**ఎన్‌డీఏ అంటే.. 'నరేంద్ర దామోదర్‌దాస్ కా అనుశాసన్': శంకరాచార్య**

**వారాణసి, అక్టోబరు 20:** దేశంలో కుటుంబ వారసత్వ రాజకీయాలు ఉండడం మంచిది కాదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అందువల్ల రాజకీయ నేపథ్యంలేని కుటుంబాలకు చెందిన యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. 'రాజకీయ వంశాలు' దేశ యువతకు నష్టం కలిగించాయని విమర్శించారు. ఆదివారం వారాణసిలో కంచిపీఠం నెలకొల్పిన ఆర్‌జే శంకర నేత్ర వైద్యశాలను ప్రారంభించడంతో పాటు, రూ.6,700 కోట్లతో చేపట్టిన వివిధ పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "పరివార్‌వాదులతో దేశానికి పెద్ద ముప్పు ఉంది. యువతకు అవకాశాలు ఇవ్వడంలో వారికి నమ్మకం లేదు. అందువల్లనే రాజకీయ నేపథ్యంలేని కుటుంబాలకు చెందిన లక్ష మంది యువత రాజకీయాల్లో పాల్గొనాలని ఎర్రకోట నుంచి పిలుపునిచ్చాను. దేశ రాజకీయాలను మార్చేందుకు, అవినీతిని, పరివార్‌వాద సిద్ధాంతాన్ని నిర్మూలించేందుకు దీన్ని ఉద్యమంలా చేపట్టాలి" అని అన్నారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు ఆశ్రిత పక్షపాతాన్ని పోషిస్తున్నాయని విమర్శించారు. గతంలో వేల కోట్ల రూపాయల కుంభకోణాలు పత్రికల్లో పతాక శీర్షికలుగా ఉండేవని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెప్పారు. కాగా, ఈ సమావేశంలో కంచి కామకోటి పీఠం శంకరాచార్య జగద్గురు విజయేంద్ర సరస్వతి స్వామి ప్రసంగిస్తూ ప్రధాని మోదీ, ఎన్‌డీఏలను దేవుడు అనుగ్రహించాడని అన్నారు. ఎన్‌డీఏ అంటే 'నరేంద్ర దామోదర్‌దాస్ కా అనుశాసన్' (నరేంద్ర దామోదర్‌దాస్ పరిపాలన) అని అభివర్ణించారు. తొలుత సంస్కృతంలో ప్రసంగాన్ని ప్రారంభించిన శంకరాచార్య మోదీ ప్రభుత్వ పనితీరును ప్రశంసించారు. అందరి సంక్షేమానికి కృషి చేస్తూ ప్రపంచంలోనే ఆదర్శ ప్రభుత్వంగా ఉంటోందని చెప్పారు. ఇటీవలి కశ్మీర్ ఎన్నికల ఫలితాలను కూడా ప్రశంసించారు. తనకు ప్రధాని మోదీతో చిరకాలంగా అనుబంధం ఉందని చెప్పారు. కోయంబత్తూరులో తొలుత నేత్ర వైద్యశాలను ప్రారంభించామని, ఇది 17వదని



చెప్పారు. ప్రధాని మోదీ తన నియోజకవర్గమైన వారాణసిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ పనులకు శంకుస్థాపన చేశారు. ఆగ్రా, బగ్‌డోగ్రా, రేవా, అంబికాపూర్, సార్‌సావా విమానాశ్రయాల పనులకు కూడా శంకుస్థాపనలు చేశారు.

# రేవంత్.. హిందూ వ్యతిరేకి

**- హిందువుల తలలు పగలగొడతారా**

**- ఇది కాంగ్రెస్ దురహంకారానికి నిదర్శనం - పరీక్షలూ సక్రమంగా పెట్టలేరా..?: కిషన్‌రెడ్డి**

**తొలి సమయం హైదరాబాద్, అక్టోబరు 20 :** ఒక వర్గాన్ని మచ్చిక చేసుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి హిందూ వ్యతిరేక వైఖరిని అనుసరిస్తున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. ముత్యాలమ్మ ఆలయంపై జరిగిన దాడికి నిరసనగా హిందూ సంఘాలు ఆందోళన చేస్తే.. వారిపై పోలీసుల చేత ఎందుకు పాశవిక దాడికి ఆదేశించారో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లాఠీచార్జ్‌లో వందలాది మంది కార్యకర్తలు తలలు పగిలాయని.. చేతులు, కాళ్లు విరిగాయని మండిపడ్డారు. ఆలయంపై దాడి జరిగితే నిరసన తెలిపే హక్కు లేదా? అని నిలదీశారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ముత్యాలమ్మ ఆలయం వద్ద హిందూ సంఘాలపై పోలీసుల దమనకాండ, అశోక్‌నగర్‌లో గ్రూప్-1 అభ్యర్థులపై లాఠీచార్జ్ కాంగ్రెస్ ప్రభుత్వ దురహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి పూర్తి హిందూ వ్యతిరేక వైఖరిని అవలంబిస్తున్నారని విమర్శించారు. వినాయకచవితి, బోనాలు, దేవీ నవరాత్రుల సందర్భంగా అనేకమందిపై అక్రమ కేసులు పెట్టించారని ఆరోపించారు. కొన్ని ప్రార్థనా కేంద్రాల్లో ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు వస్తున్న శబ్దాలు పోలీసులకు, ముఖ్యమంత్రికి వినబడవా? అని ప్రశ్నించారు. నిరుద్యోగుల ఓట్ల కోసం రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిలు అశోక్‌నగర్ లైబ్రరీకి వెళ్లి కాకమ్మ కబుర్లు చెప్పారని విమర్శించారు. పరీక్షల నిర్వహణలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన తప్పులే కాంగ్రెస్ హయాంలోనూ జరుగుతున్నాయని పేర్కొన్నారు. పరీక్షలు కూడా సక్రమంగా నిర్వహించలేని అసమర్థ ప్రభుత్వమని దుయ్యబట్టారు. జీవో 29 విషయంలో అనేక అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు.



**చర్లపల్లి స్టేషన్ సందర్శన..**

చర్లపల్లి రైల్వే టర్మినల్‌ను త్వరలోనే ప్రారంభిస్తామ కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ఆయన రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. స్టేషన్ పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రధానంగా కనెక్టివిటీ, అప్రోచ్ రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాల్సి ఉందని, ఈ విషయమై గత బీఆర్ఎస్ ప్రభుత్వం చొరవ తీసుకోవడంలో విఫలమైందని అన్నారు. కాగా, చర్లపల్లి రైల్వే టర్మినల్ ఉత్తరం వైపు రోడ్డు విస్తరణను వ్యతిరేకిస్తూ మహాలక్ష్మినగర్ కాలనీ మహిళలు కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. రోడ్డు విస్తరణతో తాము ఇళ్లను కోల్పోతామని.. ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలని విన్నవించారు.

**రాహుల్.. అబద్ధాల మిషన్: లాల్‌సింగ్ ఆర్య**


కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. అబద్ధాల మిషన్ అని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లాల్‌సింగ్ ఆర్య విమర్శించారు. రిజర్వేషన్లు, రాజ్యాంగంపై ఆయన లోక్‌సభ ఎన్నికల ముందు తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అబద్ధాలు ప్రచారం చేయడం వల్లనే జమ్మూ కశ్మీర్, హరియాణాల్లో కాంగ్రెస్, ఓటమి పాలైందన్నారు.

# అనుమతులుంటే.. కూల్చం!

**- సీఎం ఆదేశాలను అమలు చేస్తాం - హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రకటన**

**- ముఖ్యమంత్రి ప్రకటన నేపథ్యంలో స్పష్టత - అనుమతుల్లేని వాటినే కూల్చామని వెల్లడి**

**తొలి సమయం హైదరాబాద్, అక్టోబరు 20:** భవన నిర్మాణాలకు సంబంధించిన సంస్థల నుంచి అనుమతి(చెల్లుబాటయ్యే అనుమతి) తీసుకొని చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. అన్ని రకాల అనుమతులు పొంది నిర్మించిన నిర్మాణాలకు కూల్చివేతల భయం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం చేసిన వ్యాఖ్యలపై హైడ్రా కమిషనర్ స్పష్టతనిచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు హైడ్రా కట్టుబడి ఉందని ఆదివారం ఓ ప్రకటన చేశారు. చెరువుల పక్కనున్న నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తుందని సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం జరుగుతుండడంతో కొనుగోలుదారులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటిదాకా హైడ్రా కూల్చేసిన నిర్మాణాలన్నీ అనుమతులు లేకుండా నిర్మించినవేనని చెప్పారు. దుండిగల్, మల్లంపేట, అమీన్‌పూర్‌లో అనుమతులు ఇచ్చిన అనంతరం అవి ప్రభుత్వ స్థలాలని తెలిసి వాటిని రద్దు చేశారని, కానీ దెవలపర్లు నిర్మాణాలు చేపట్టి విక్రయించడంతో కూల్చివేశామని వివరించారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో ప్రజలు నివసిస్తోన్న భవనాల జోలికి వెళ్లమని గతంలోనే చెప్పామని గుర్తు చేశారు. సీఎం ఆదేశాల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో చెల్లుబాటయ్యే అనుమతులతో నిర్మిస్తోన్న భవనాలను ఇక నుంచి కూల్చేది లేదని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా చేపడుతోన్న నిర్మాణాల విషయంలో మాత్రం చట్ట ప్రకారం వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలకు ప్రభుత్వ విభాగాలు ఇకపై అనుమతులివ్వకుండా చూస్తామని, కొత్త నిర్మాణాలు రాకుండా నిఘా పెడతామని తెలిపారు. అక్రమ నిర్మాణాలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై ప్రాథమిక విచారణ జరుగుతోందని, సమగ్ర వివరాల సేకరణ అనంతరం తదుపరి చర్యలుంటాయని రంగనాథ్ చెప్పారు. కాగా, చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో హైడ్రా కూల్చివేసిన భవనాల్లో అధిక భాగం దెవలపర్లు నిర్మించి సాధారణ పౌరులకు విక్రయించినవే. ఇందులో కొన్ని అనుమతులు ఉన్నవి కాగా.. ఇంకొన్ని అనుమతులిచ్చి అనంతరం రద్దు చేసినవి. కొన్ని నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేవు. ఇందులో అనుమతులున్న భవనాలను హైడ్రా కూల్చివేయడంతో సామాన్యులు తీవ్రంగా నష్టపోయారు. అయితే, చెరువుల వద్ద ఉన్నా అనుమతులుంటే ఆ నిర్మాణాలను కూల్చమని హైడ్రా తాజాగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో గతంలో పర్మిషన్ ఉన్నా కూల్చివేతలు చేపట్టడంతో నష్టపోయిన సామాన్యుల పరిస్థితి ఏంటి ? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నిజానికి ఏదైనా



నిర్మాణానికి అనుమతులిచ్చి రద్దు చేస్తే... నిర్మాణ పనులు జరగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే. కానీ, నిర్మాణదారులతో కుమ్మక్కైన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో అనుమతుల రద్దు సంగతి తెలియక, పాత పత్రాలను చూసి ఇళ్లు కొనుగోళ్లు చేసిన వారు ఇప్పుడు నష్టపోయారు. ఈ బాధితుల అంశంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

## కులగణన పూర్తయ్యే వరకు బీసీలూ.. అప్రమత్తం

**రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష, బీసీ నేతలు**

**బీసీలు రాజకీయ అధికారం సాధించుకునేందుకు కులగణన ఏకైక పరిష్కారం : వీహెచ్**




**తొలి సమయం హైదరాబాద్, అక్టోబరు 20:**
రాష్ట్రంలో కులగణన పూర్తయ్యే వరకు బీసీలంతా అప్రమత్తంగా ఉండాలని పలు పార్టీల నేతలు, బీసీ నేతలు అన్నారు. తెలంగాణలో సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచాలని చేస్తున్న పోరాటం విజయవంతమైందని పేర్కొన్నారు. సమష్టి పోరాటం మూలంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో18 విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్రంలో "సమగ్ర కులగణనకు మద్దతుగా అఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశం" సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ కులగణనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేసిందని, ఇప్పటికే కులగణన ప్రక్రియ ప్రారంభమైందన్నారు. రాష్ట్రంలో అధిక శాతమున్న బీసీలు రాజకీయ అధికారం సాధించుకోవడానికి కులగణన ఏకైక పరిష్కారమార్గమన్నారు. శాసనమండలిలో విపక్షనేత మధుసూదనాచారి మాట్లాడుతూ కులగణన పూర్తయ్యే వరకు బీసీ సమాజం నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ మాట్లాడుతూ.. జనాభా లెక్కల తర హాలో కాకుండా స్పష్టంగా కులగణన జరగాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. కులగణనపై బీసీ నేతలు చేస్తున్న న్యాయపోరాటానికి తమ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. మాజీమంత్రి శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ కులగణన త ర్వాతే రాష్ట్రంలో ఎన్నికలు జరపాలని, ప్రభుత్వం ఏసాకులు చూపకుండా కులగణనను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణలో సమగ్ర కులగణన చేపట్టాలని గత ఆరు నెలలుగా ప్రజాస్వామ్యబద్ధంగా బీసీలు చేసిన పోరాటమే ఈ విజయమన్నారు.

## ఎనుముల కాదు.. ఎగవేతల రేవంత్

**హామీలు నెరవేర్చే వరకు అలాగే పిలుస్తాం..**

**ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలని మోసం**

**సీఎంకు ధైర్యం ఉంటే అశోక్ నగర్ వచ్చి నిరుద్యోగులతో మాట్లాడాలి**

**మూసీ నిర్వాసితులకు ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి**

**: మాజీ మంత్రి హరీశ్‌రావు**

**తొలి సమయం, తిమ్మాపూర్,గజ్వేల్, అక్టోబరు 20:** ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలను దగా చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి తన పేరును ఎగవేతల రేవంత్‌రెడ్డి అని మార్చుకోవాలని సూచించారు. ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చే వరకు ఆయనను ఆ పేరుతోనే పిలుస్తామన్నారు. చీఫ్ మినిస్టర్ అని పిలిపించుకుంటారో, చీప్ మ్యాన్.. చీటింగ్ మ్యాన్ అని పిలిపించుకుంటారో ఆయనే తేల్చుకోవాలని వ్యాఖ్యానించారు. ఆదివారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో బీఆర్ఎస్ అలయ్‌బలయ్ కార్యక్రమానికి హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగాను, తర్వాత సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోనూ ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ వాళ్లు గ్యారెంటీల గారడీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చారన్నారు. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీతో కలిసి హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని సెంట్రల్ లైబ్రరీకి వెళ్లి ఏడాదికి రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. ఉద్యోగాలు అడుగుతున్న యువతను రాక్షసుల్లా వేధిస్తున్నారన్నారు. సీఎంకు ధైర్యం ఉంటే సెక్యూరిటీ లేకుండా సెంట్రల్ లైబ్రరీకి వచ్చి నిరుద్యోగులతో మాట్లాడాలని హరీశ్‌రావు సవాల్ విసిరారు. ఒకే విడతలో రుణమాఫీ



చేస్తానని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి ఇప్పటికి మూడు విడతల్లో కూడా పూర్తిస్థాయిలో చేయలేకపోయారన్నారు. రుణమాఫీ చేస్తానని దేవుడి మీద ఒట్టు పెట్టి మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డి తప్ప దేశంలో ఎవ్వరూ లేరన్నారు. దేవుడిని కూడా మోసం చేసిన సీఎం రేవంత్ రెడ్డినే చూస్తున్నామన్నారు. పాలకుడే పాపం చేస్తే రాజ్యానికి అరిష్టమని ఓ అయ్యగారు తనకు చెప్పారని, రేవంత్ రెడ్డి వల్ల ప్రజలకు ఎక్కడ ఇబ్బంది అవుతుందోనని క్షమించాలని కోరేందుకు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దగ్గరకు పోతే తనపై కేసు పెట్టించారని హరీశ్‌రావు విమర్శించారు. రూ.15 వేల రైతుబంధు ఇస్తామని చెబితే ప్రజలు నమ్మి కాంగ్రెసకు అధికారం ఇస్తే.. ఉన్న రూ.10 వేల రైతుబంధును కూడా బంద్ చేశారన్నారు. కాంగ్రెసను గట్టిగా ప్రశ్నించకపోతే యాసంగికి కూడా రైతుబంధును ఎగ్గొడతారన్నారు.

## బీఆర్ఎస్ హయాంలో రూ.25వేల కోట్ల దుర్వినియోగం

**సాగులో లేని భూములకూ రైతుబంధు ఇచ్చారు: తుమ్మల**

**తొలి సమయం, ఖమ్మం అక్టోబరు 20:** సాగులో లేని భూములకు కూడా రైతుబంధు ఇచ్చి రూ.25వేల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేసిన ఖ్యాతి మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఖమ్మం నగరంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు పథకాల పేరుతో రూ.7,600 కోట్ల అప్పులు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో పెట్టిందన్నారు. గత ప్రభుత్వంలో చేసిన వందల కోట్ల అప్పులను తాము తీరుస్తున్నామన్నారు. రైతుబంధు పథకం పేరుతో వ్యవసాయ ప్రాధాన్యత కలిగిన వ్యవసాయ యాంత్రీకరణ, పంటల బీమా, డ్రిప్ ఇరిగేషన్ పథకాలను బీఆర్ఎస్ బొందపెట్టిందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటల భీమా, వ్యవసాయ యాంత్రీకరణ వంటి పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండదండగా నిలుస్తుందని తుమ్మల చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనలో మొదటి ఏడాదిలోనే రైతులకు రూ.27వేల కోట్లు సంక్షేమానికి చెల్లించామన్నారు.

# జర్నలిస్టుపై దాడి కేసులో ముగ్గురేనా..!

**- మరో ముగ్గురి మాటేమిటి? - నిందితులందరినీ అరెస్టు చేయాలి**

**- సుదర్శన్ భద్రత కై డిమాండ్. - ఖమ్మంలో సుదర్శన్ ను పరామర్శించిన డబ్ల్యుజేఐ బృందం**



**తొలి సమయం ఖమ్మం, అక్టోబర్ 20:** ఆరుగురు వ్యక్తులు విచక్షణారహితంగా జరిపిన దాడిలో తీవ్రంగా గాయపడి ఖమ్మం ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండల ఆదాబ్ హైదరాబాద్ పత్రిక విలేఖరి సుదర్శన్‌ను బిఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ ప్రతినిధి బృందం పరామర్శించింది. బీరుబాటిలళ్ళు, ఇనుప రాడ్లతో ఆరుగురు వ్యక్తులు జరిపిన దాడిలో ఛాతి, దవడ ఎముకలు విరిగి ఇంటెన్సివ్ కేర్ లో చికిత్స పొందుతున్న సుదర్శన్ ను పరామర్శించిన డబ్ల్యూజేఐ నేతలు ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుదర్శన్ పై దాడి ఘటనలో పాల్గొన్న వ్యక్తులకు సంబంధించి వీడియో ఫుటేజ్ సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా ప్రచారం అయినప్పటికీ, ఇందులో కేవలం ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ కుపంపి, మరో ముగ్గురి విషయంలో విచారణ పేరిట కాలయాపన చేస్తుండటం అనేక అనుమానాలకు తావునిస్తున్నదని యూనియన్ నాయకులు తాడూరు కరుణాకర్, న్యాలకొండ అనిల్ రావు అన్నారు. ఇల్లందు పోలీసులు రాజకీయ నేతలు,లేదా ఇతరత్ర ఒత్తిళ్లకు తలవొగ్గి ఈ కేసులో నిందితులను ఉపేక్షిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. సుదర్శన్ పై గతంలో కూడా హత్యాయత్నం జరిగిందని, అదృష్టవశాత్తు ఈ రెండు ఘటనల నుండి ఆయన బతికి బయటపడ్డారని, కనుక భవిష్యత్తులో ఆయన ప్రాణాలకు రక్షణ కల్పించే బాధ్యత స్థానిక పోలీస్ యంత్రాంగంపైనే ఉందన్నారు. జర్నలిస్ట్ సుదర్శన్ పై జరిగిన పాశవికదాడిని వారు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి ఘటనలకు తావు లేదన్నారు. ఒక పాత్రికేయునిపై దాడి జరపడం అంటే, అది యావత్ పాత్రికేయ లోకంపై జరిగిన దాడిగా భావించాల్సి ఉంటుందన్నారు. జిల్లా మంత్రి, ప్రభుత్వం ఈ విషయంలో స్పందించాల్సిన అవసరం ఉందని,ఇల్లందు ఘటనపై సమగ్ర విచారణ జరిపించి,దోషులు ఎంతటి వారైనాకఠినంగా శిక్షలు పడే ఏర్పాటు చేయాలనిడిమాండ్ చేశారు. ఖమ్మం ఆస్పత్రిలో జర్నలిస్టు సుదర్శన్ వారి కుటుంబ సభ్యులను కలసి పరామర్శించిన వారిలో డబ్ల్యూజేఐ నాయకులు ఆడెపు లక్ష్మీనారాయణ, డి శ్రీధర్ తదితరులు ఉన్నారు.

# రైతు భరోసా ఉన్నట్లా..? లేనట్లా..?

**చిట్యాల వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ కొడారి రమేష్ యాదవ్**




**తొలి సమయం జయశంకర్ భూపాలపల్లి 20:** బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో రైతుబంధు కింద ఇచ్చే 10 వేలు రైతులకు ఏమాత్రం సరిపోవడం లేదని..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రైతు భరోసా కింద 15 వేలు ఇస్తామని ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికి.. రైతులకు 2 లక్షల రుణమాఫీతో పాటు రైతు భరోసా కింద 15 వేలు ఇస్తామని మాయమాటలు చెప్పి రైతుల ఓట్లను దండుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీని పూర్తిగా అమలు చేయాలని, అదేవిధంగా రైతు భరోసా ఉన్నట్లా..? లేనట్లా..? ఏదో విషయాన్ని రైతులకు తెలియజేయాల్సిన అవసరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందని చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొడారి రమేష్ యాదవ్ అన్నారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు నేతృత్వంలో మండల కేంద్రంలో నిరసన చేపట్టి, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొడారి రమేష్ యాదవ్, మొగుళ్ళపల్లి మాజీ జెడ్పిటిసి జోరుక సదయ్యలు మాట్లాడారు. 6 గ్యారంటీలతో 420 హామీలను ఇచ్చి ప్రజలను, రైతు భరోసా..రైతు రుణమాఫీ పేరుతో రైతులను, రెండు లక్షల ఉద్యోగాల పేరుతో విద్యార్థులను, యువకులను మభ్యపెట్టి ఓట్లను దండుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వీరందరిని నిట్టనిలువునా మోసం చేసిందన్నారు. రైతు భరోసా నిధులను వెంటనే రైతుల అకౌంట్లో వేయాలని, మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ. 2500 ఇప్పటి వరకు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదని కేసీఆర్ రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడితే..కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వాటిని అమలు చేయకపోగా రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఇప్పటికైనా రైతు భరోసా నిధులను రైతుల అకౌంట్లో జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడి కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిసిల్ల గ్రామ మాజీ సర్పంచ్ నైనకంటి ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు నరహరి వెంకట్ రెడ్డి, కొర్కిశాల మాజీ సర్పంచ్ దానవేని రాములు మరియు వివిధ గ్రామాల సర్పంచులు, రైతులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# వలస ఆదివాసీలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

**- చర్లలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలి - ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి**

**- చర్ల ఇసుక మాఫియా పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి - ఏజెన్సీ చట్టాలను పరిరక్షిస్తూ, అక్రమ పట్టాలని రద్దు చేయాలి**

**- తెలంగాణ జన సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా నియోజకవర్గ ఇన్ ఛార్జ్ గోపగాని శంకర రావు**



**తొలి సమయం చర్ల, అక్టోబర్ 20**

గత యాభై సంవత్సరాల క్రితం చత్తీస్ ఘడ్ రాష్ట్రం నుంచి వలస వచ్చి చర్ల మండలంలో నివసిస్తున్న ఆదివాసీలకు మరల షెడ్యూల్ తెగల కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని తెలంగాణ జన సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్ ఛార్జ్ గోపగాని శంకర్రావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చర్ల మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ 2021 వ సంవత్సరం వరకు వలస ఆదివాసీలకు కుల ద్రవీకరణ పత్రాలు ఇచ్చారని ఆ తర్వాత ఇవ్వకపోవడం వల్ల అనేకమంది పిల్లలు చదువుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారని, ఎటువంటి ప్రభుత్వ పథకాలు అందక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు. తక్షణమే వారికి కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులకు భూమార్పిడి చేయడం, పట్టాలు చేయడం జరుగుతుందని అధికారులు గుర్తించి ఆ పట్టాలను రద్దుచేసి ఏజెన్సీ చట్టాలను కాపాడాలని, ఆదివాసి హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వాలు తగు చొరవ చూపాలని ఆయన కోరారు. చర్ల మండలంలో లక్షలాది క్యూబిక్ మీటర్ల ఇసుకకు అనుమతులు ఇచ్చారని, సుమారు మూడు లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకకు అనుమతులు ఇస్తే కింద నిర్మించే సీతారామ ప్రాజెక్టు పరిస్థితి ఇబ్బందికరంగా మారుతుందని, పర్యావరణం దెబ్బతిని గోదావరి నీటిమట్టాలు అడుగంటి పంటలకు నీరు వచ్చే పరిస్థితి ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా కొంతమంది వ్యాపారులు కలిసి అమాయక ఆదివాసి ప్రజల వద్ద నుండి ఇసుక సొసైటీ ర్యాంపులు తీసుకొని వారికి నామమాత్రంగా డబ్బులు చెల్లిస్తూ కోట్లాది రూపాయలను గడిస్తున్నారని, పిసా, వాల్టా చట్టాల ప్రకారం ఇసుక ర్యాంపులు నడవడం లేదని ఆయన అన్నారు. గోదావరి నదిలోకి ఎటువంటి భారీ యంత్రాలు దిగకుండా ఆ ప్రాంత గిరిజన ప్రజలకు ఉపాధి కల్పించాలని నిబంధనలు చెబుతున్నా, ఆ విధంగా ఎక్కడ పాటించకుండా ఆదివాసి చట్టాలను ఈ ప్రాంత ప్రజలను ఇసుక మాఫియా మోసం చేస్తుందని దుయ్యబట్టారు. తక్షణమే ఇసుక మాఫియాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొని ఆదివాసి చట్టాలను కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. వద్దిపేట వద్ద తాలిపేరు ప్రాజెక్టు పై చెక్ డ్యాం నిర్మించడం వలన సుమారు 15 గ్రామాలకు తాగు, సాగునీరు అందుతుందని ఆ ప్రాంత పంట పొలాలు సస్యశ్యామలమై నిరుపేద ఆదివాసీలకు , కూలీలకు ఉపాధి లభిస్తుందని తక్షణమే వద్దిపేట వద్ద చెక్ డ్యాం నిర్మించాలని ఆయన కోరారు. గత పదేళ్లుగా ప్రొఫెసర్ సాయిబాబాను అండా జైల్ లో ఉంచి చిత్రహింసలు పెట్టిన కేంద్ర ప్రభుత్వం గత కొన్ని నెలల క్రితం నిర్దోషి అని విడుదల చేయడం జరిగిందని, దానిని జీర్ణించుకోలేని ప్రొఫెసర్ సాయిబాబా మానసికంగా కృంగిపోయి మరణించడం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి రాజద్రోహం చేయకపోయినా ఉపా చట్టం ప్రయోగించి తప్పుడు కేసులు పెట్టి కేంద్ర ప్రభుత్వం ఆయనను హింసించడం వల్లనే ఆయన చనిపోయారని ఇటువంటి వాటికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు. చర్ల మండలంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఏర్పాటు కొరకు, ఫైర్ స్టేషన్ ఏర్పాటు కొరకు ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, టీజేఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తెలంగాణ సాధకుడు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం సార్ నేతృత్వంలో వినతిపత్రం అందించడం జరుగుతుందని, డిగ్రీ కాలేజీ సాధించేవరకు అవిశ్రాంతంగా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పూనెం ప్రదీప్ కుమార్, రేపాక రామారావు గుప్తా, చర్ల మండల నాయకులు మడకం చందు, జలగం సోమయ్య పాల్గొన్నారు.

## చీకటి బతుకుల్లో వెలుగులు నింపుతున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్



**తొలి సమయం జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 20**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా :మొగుళ్ళపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించారు. ఈఉచిత కంటి పరీక్షలకు సుమారు 150 మంది ప్రజలు హాజరై కంటి పరీక్షలు చేయించుకోగా అందులోని 60 మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉందని కంటి వైద్య నిపుణులు డాక్టర్ పూజారి దత్తాగౌడ్ నిర్ధారించారు. ఈ సందర్భంగా జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి మాట్లాడారు. కంటి ఆపరేషన్లు అవసరం ఉన్న వారిని త్వరలో కరీంనగర్ కంటి ఆసుపత్రికి తీసుకువెళ్లి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయిస్తామని తెలియజేశారు. అలాగే కంటి సమస్యలతో బాధపడేవారు ఎవరైనా ఉంటే ఈ ఫోన్ నెంబర్ ను 939107 5767 సంప్రదించాలని తెలియజేశారు ఈ కార్యక్రమానికి జయశంకర్ ఫౌండేషన్ మొగుళ్ళపల్లి మండల ప్రెసిడెంట్ నేర్పటి అశోక్, వైస్ ప్రెసిడెంట్ మంగళపల్లి శ్రీనివాస్, రేగొండ మండల ఇంచార్జ్,:ఆకుల ప్రతాప్, యూత్ ఇంచార్జ్ చింతకింది రాజు, నేర్పటి శ్రీనివాస్, జన్నే సదానందం, ,శంషీర్, కేశెట్టి రమేష్ పాల్గొన్నారు.

## రైతుల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుంది

**-విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడిన చదువు అన్నారెడ్డి**

**తొలి సమయం భూపాలపల్లి అక్టోబర్ 20:**



దేవుళ్ళ మీద ఒట్లు వేసి ఓట్లు అడిగిన సీఎం రేవంత్ రెడ్డికి రైతు రుణమాఫీపై ధ్యాస లేదని, సీఎం రేవంత్ రెడ్డి దేవుళ్లపై ఒట్టు వేస్తే ఆ దేవుళ్లే భయపడుతున్నాయని, ఇంత దివాలకోరు, దగాకోరు ప్రభుత్వాని ఎక్కడా చూడలేదని, రైతు రుణమాఫీ, రైతు భరోసా అమలయ్యే వరకు రైతుల పక్షాన నిలబడి బీఆర్ఎస్ పార్టీ తరపున నిరసనలు, ఆందోళనలు, పోరాటాలు చేస్తామని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఎగొట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని సర్పంచుల ఫోరం మొగుళ్లపల్లి మండల మాజీ అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిత్యం పచ్చి అబద్ధాలు చెబుతూ..ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తుందే తప్పా..ప్రజలకు ఇచ్చిన హామీలను మర్చిపోయిందని ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

## మానుకోటలో డబ్ల్యూజేఐ ప్రథమ సమీక్ష సమావేశం

**జర్నలిస్ట్ సమస్యలపై సంఘాలవి గాడితప్పిన మౌలిక పోరాటాలు..**

**తాడూరి కర్ణాకర్ డబ్ల్యూ జే ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు**




**తొలి సమయం మహబూబాబాద్ అక్టోబర్ 20 :**

జర్నలిస్టు సంఘాలు వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలపై పోరాడడంలో మౌలి కంగా గాడి తప్పయని, సీనియర్ జర్నలిస్టు డబ్ల్యూ జే ఐ రాష్ట్ర ఉపాధ్యక్షు తాడూరి కర్ణాకర్ అన్నారు.. జిల్లా కేంద్రంలోని వికాస్ జూనియర్ కాలేజీలో డబ్ల్యూ జే ఐ ప్రథమ సమీక్ష జరిగింది తొలి సమయం దినపత్రిక ఎడిటర్ వి. అయోధ్య రామయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై కరుణాకర్ మాట్లాడుతూ.. గత 60 సంవత్సరాల నుండి జర్నలిస్టుల సమస్యల కోసమే ఏర్పడిన సంఘాలు కొన్ని మసక పారిపోగా. కొన్ని సంఘాలు వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పై గాడి తప్పిన పోరాటాలు చేస్తున్నాయని ఆవేదన పడ్డారు కేవలం తెలంగాణ అస్తిత్వము. ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షలతో ఏర్పడిన సంఘము పూర్తిగా అంపశయ్యపై ఆ చేతనంగా కొట్టుమిట్టాడుతున్న సందర్భాన్ని మనం గమని స్తున్నాము అన్నారు.. ఇప్పుడు ఆ సంఘాలలోనే ఉండలేక, బయటకు రాలేక అనేకమంది నికార్సైన నాయకులు.. ఒక మంచి సంఘం కోసం వేచి చూస్తున్నారని అన్నారు. డబ్ల్యూ జే ఐ పైన్నే అందరి నజర్ ఉన్నది అనేది వాస్తవం అన్నారు. న్యాలకొండ అనిల్ దేశాయ్ మరియు ఆడెపు లక్ష్మీనారాయణ. డబ్ల్యూ జే ఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి లు మాట్లాడుతూ.. దేశంలోనే రెండవ అతిపెద్ద కార్మిక సంఘం అయినటువంటి బి ఎం ఎస్ భారతీయ మజ్దూర్ సంగ్ కు అనుబంధంగా ఏర్పడ్డ డబ్ల్యూజేఐకి దేశం పట్ల సమాజం పట్ల ఒక సమగ్రమైన అభిప్రాయం కలిగి ఉన్నదన్నారు.. ఇప్పటికీ ఇది 16 రాష్ట్రాలలో విస్తరించింది అన్నారు.సంఘంలో చేరిన ప్రతి సభ్యుడి సంక్షేమం కోసం పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు నాయిని ఇంద్రారెడ్డి, వార్త మానుకోట ప్రతినిధి ఆకుల రమేష్. బయ్యారం వార్త రిపోర్టర్ సుమన్ రెడ్డి.. వార్త ప్రభ ప్రతినిధి చిట్టిమల్ల శ్రీను తో సహా 20మంది జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## సిఓపి గడువు 31 డిసెంబర్ వరకు పొడిగింపు

**తొలి సమయం కరీంనగర్, అక్టోబర్ 20**

న్యాయ వాదుల సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీసింగ్ (సి ఓ పి) అప్లై చేసుకోవడానికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 31 డిసెంబర్, 2024 వరకు గడువు పెంచారని సీనియర్ తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ కసుగంటి లక్ష్మన్ కుమార్ ఒక్క ప్రకటనలో ఆదివారము తెలిపారు. ప్రతి న్యాయ వాది 5 సం. లకు ఒక్కసారి రెన్యువల్ చేసుకోవాలనే నిబంధన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విధించారు . అందులో భాగంగా ప్రాక్టీస్ చేస్తున్న ప్రతి న్యాయవాది 5 సం లలో 5 వకాలత్ లు రెన్యువల్ కోసం జత చేయాలనే నిబంధన ఉన్నది. కాని 1989 లోపు న్యాయవాది గా ఎన్రోల్మెంట్ చేసుకొన్న వారు 5 వాకలత్ ఉంటే సబ్మిట్ చెయ్యవచ్చు, లేని వాళ్ళు కూడా రెన్యువల్ చేసుకోవచ్చన్ని ఈ సందర్భంగా కాసుగంటి లక్ష్మన్ కుమార్ తెలిపారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101